


# గౌరి

గౌరి గంగిగోవు లాంటి పిల్ల. ఆమె ఏ ఇంటికి వెళుతుందో గాని ఆ ఇల్లు నిత్యకళ్యాణం పచ్చతోరణంగా ఉంటుందని ఆమెని చూసిన వాళ్లంతా అనేవారు. గౌరి నెమ్మదైన పిల్ల. నెమ్మదిగా మాట్లాడేది. మితంగా, స్థిమితంగా, తియ్యగా మాట్లాడేది. ఆమె పెద్ద కళ్లు ఎప్పుడూ వినయం, వివేకమూ తొణికిసలాడుతూ ఉండేవి.

ఆమె తండ్రి వెంకటశాస్త్రి పోలికతో పుట్టింది. వెంకటశాస్త్రి ఊళ్లో ఆడా మగా అందరికీ తల్లో నాలుకలా ఉంటాడు. అతడు పెద్ద పండితుడూ కాదు, విశేషించి పెద్ద లౌక్యమూ లేదు. మామూలు పురోహితుడు, అంతే. అయినా నోరు మంచిది అయితే ఊరు మంచిదవుతుంది కదా! అంచేత గౌరి అదృష్టవంతురాలంటారు చూసిన వాళ్లంతా. తండ్రి పోలికతో పుట్టిన ఆడపిల్ల అదృష్టవంతురాలు కాకమరేమిటి?

అయితే గౌరివి సాధారణమైన తెలివితేటలు కావు. అసాధారణమైన తెలివితేట్లు. కాని అది మబ్బులో మెరుపులాంటి చురుకుతనం కాదు. పున్నమి నాటి వెన్నెల లాంటి చల్లని కాంతి. ఆమె తల్లి-దండ్రులు గాని, స్కూల్లో ఉపాధ్యాయులు గాని, ఊళ్లో ఇంకెవరూ గాని ఆమె ప్రతిభను సరిగా అంచనా వెయ్యలేక పోయారు. ఆమె ఒక పల్లెటూళ్లో సంప్రదాయ కుటుంబాల్లో పుట్టి పెరిగే మామూలు ఆడపిల్ల ల్లాంటిది కాదని ఎవరికీ తట్టలేదు.

పరమేశ్వరశాస్త్రి మాత్రం గౌరిని చూడగానే ఆమె ప్రత్యేకతల్ని ఇట్టే పోల్చుకున్నాడు. అతడు గౌరికి మేనమామ. పట్టణంలో ఉంటూ, పెద్ద పెద్ద వాళ్లతో తిరుగుతూ, రెండు చేతులా సంపాదిస్తున్న వాడు. పల్లెటూళ్లో పింతల్లి కూతుర్ని చూడడానికి వచ్చి, పెళ్లికి ఎదిగిన పదిహేడేళ్ల గౌరిని చూడగానే అతడికి తన కొడుకు గోపాలశాస్త్రి మనసులో మెదిలేడు. ఈ మేనకోడలు తన కోడలైతే ఇల్లు పట్టకుండా తిరుగుతున్న గోపీని ఒకదారికి తెస్తుందని అతడికి అనిపించింది. ఎనిమిదేళ్ల తరవాత చూస్తే బాగా పొడుగు ఎదగడమే కాదు, గౌరి సంసార బాధ్యతలు నిర్వహించే పరిపక్వత కూడా పొందిందనిపించింది అతడికి.

కె. గోదావరిశర్మ



అంచేత అతడు గౌరిని తనతోబాటు కొన్నాళ్ళు మద్రాసు పంపించమంటే, వెంటనే కాకపోయినా కొంచెం ఆలోచించిన మీదట ఒప్పుకున్నారు పార్వతమ్మ, వెంకటశాస్త్రి. పరమేశ్వరశాస్త్రి కొడుకు పెళ్ళికొడుకని వాళ్ళకి తెలుసు. అయితే అతడి ఇటీవలి ఘనకార్యాల గురించి మాత్రం తెలీదు. బతకనేర్చిన తండ్రి కొడుక్కి కూడా బతుకు తెరువు చూపించే ఉంటాడని వాళ్ళ నమ్మకం. ఆ ఇంటికి కోడలయితే గౌరి భవిష్యత్తు కూడా భద్రంగా ఉంటుందని వాళ్ళకి అనిపించింది. పెద్ద కట్నాలు పోసి పెళ్ళి చేసే తాహతు లేనప్పుడు, ఉన్న ఒక్కపిల్లా అత్తవారింట్లో సుఖపడాలంటే ఇదొక్కటే మార్గమని భర్తకి నచ్చజెప్పింది పార్వతమ్మ. దేవుడు చల్లగా చూసి ఈ సంబంధం కుదరాలే గాని అంతకంటే వాళ్ళు కోరుకునేదేమీ వుండదు. అయిన సంబంధం కనక పిల్ల వాళ్ళ ఆకులో అన్నం తీసుకు తినవచ్చు. అంచేత కాబోయే మామగారితో గౌరిని పంపించడంలో వాళ్ళు చాలా ముందుచూపు ప్రదర్శించారనే చెప్పాలి. పెళ్ళికాని పిల్లని, కాబోయే అత్తవారింటికే అయినా, పంపించడం లోకం దృష్టిలో ఆమోదయోగ్యం కాకపోయినా, కూతురు భవిష్యత్తు దృష్ట్యా ధైర్యం చేశారు ఆ దంపతులు. పోనీ వెళ్ళనీ, ఆ ఇల్లూ ఈ ఊరూ అలవాటవుతాయి, జీవితాంతమూ అక్కడ మెలగవలసిందే కదా అని అనుకున్నారు.

ఆ విధంగా గౌరి మద్రాసులో తన అదృష్టాన్ని వెతుక్కోవడానికో, స్థిరపరచుకోవడానికో ప్రయాణం అయింది. పుట్టి పెరిగిన పల్లెటూరిని విడిచి వెళ్ళడం ఆమెకి చాలా కష్టంగా తోచింది. ఊరి చెరువు, కోవెల, అందులో దేవుళ్ళు, వీధులు, వీధరుగుల మీద పలకరించే మొహాలు, ఇరుగు పొరుగులు, పాడి పశువులు, ఆమె బొమ్మలు, పుస్తకాలు– ఇవన్నీ ఆమె నిత్యజీవితంలో ఒక భాగమై పోయాయి. వాటిని వదలి దూరంగా వెళ్ళడం అంటే శరీరంలోని ఒక అవయవాన్ని కోసి తీసేసినట్టే. ఇంతకీ ఈ హంగామా అంతా ఫలప్రదమౌతుందా? పట్టణంలో ఇంతకంటె ఆనందకరమైన జీవితం దొరుకుతుందా? ఏమో, ఎవరికి తెలుసు? సందేహాలతో సతమతమవడం గౌరి లక్షణం కాదు. ఆమెకి తెలిసిందల్లా తల్లిదండ్రులకి విధేయత చూపించడం. వాళ్ళు తన శ్రేయోభిలాషులు. తనకి కష్టం కలిగించే పని వాళ్ళెందుకు చేస్తారు?

ప్రయాణపు రోజున ఆ ఇంట్లో హడావిడి అంతా ఇంతా కాదు. పార్వతమ్మ, వెంకటశాస్త్రి కుమార్తెకి వెయ్యి సలహాలిచ్చారు. మేనమామగారింట్లో ఎలా మసలుకోవాలో. గౌరి, అవన్నీ తనకీ తెలిసినవీ, పుస్తకాల్లో చదివినవే అయినా వెయ్యి సలహాలూ వినయంగా వింది. కణ్వాశ్రమం విడిచి నగరానికి వెళ్ళే శకుంతలలా ఉంది ఆమె స్థితి. ఇరుగు పొరుగులు కూడా యధావిధిగా కళ్ళొత్తుకుని ఆమెకి వీడ్కోలు చెప్పేరు. చూసిన వాళ్ళకి, పెళ్ళి అయిపోయి గౌరి శాశ్వతంగా అత్తవారింటికి వెళుతూందేమో అనిపించింది.

అయితే ఇటీవల కొన్నేళ్ళ పల్లెటూరి పద్ధతులకి దూరమైన పరమేశ్వర శాస్త్రికి మాత్రం ఇదంతా మోటుగా, హాస్యాస్పదంగా అనిపించింది. అయినా ఏమీ అనకుండా చెల్లెలు, బావగార్ల చాదస్తాన్ని భరించాడు. అతనికి కావలసినది వాళ్ళు కాదు, 'వన్నె మైపైది తులతూగు' మేనకోడలు కదా? అంతే కాదు, తన కొడుక్కి ఒక్క పైసా కూడా కట్నం పుచ్చుకోనని ఉదారంగా చెప్పేశాడు. "మనం మనం ఒకటి. మధ్యలో పాపిష్టి డబ్బు ప్రవేశించి మనని విడదియ్యాలా ఏమిటి?" అన్నాడు. ఆడపిల్లని ఇచ్చుకునే వాళ్ళకి అంతకన్నా ఏం కావాలి? వాళ్ళు ఆనందబాష్పాలు తుడుచుకున్నారు.

మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో సర్కార్ ఎక్స్‌ప్రెస్ దిగిన గౌరికి అదంతా మరేదో లోకం లాగా అనిపించింది. నిద్రలో నడుస్తున్న దానిలాగా మామయ్య వెనకనే అడుగులు వేసింది. రైల్వే స్టేషన్ చెదిరిన చీమల పుట్టలా ఉంది. ఆమె అంతమంది మనుషుల్ని ఒకేసారి ఒకే దగ్గర, వాళ్ల ఊరు ముత్యాలమ్మ పండుగనాడు కూడా చూళ్ళేదు. బయటకొచ్చేక ఎత్తైన భవనాలు, విశాలమైన వీధులతో ఆ నగరం గౌరిని మరింత మంత్రముగ్ధని చేసింది. ఆ నగరంలో తనూ ఒక భాగం కాబోతున్నందుకు ఆమెకి కొంచెం భయం, కించిత్ గర్వం కలిగేయి. అక్కడ సినిమా తారలు ఉంటారని తప్ప అంతకు మించి ఆమెకి మద్రాసు గురించి ఇంకేమీ తెలియదు. అయితే వెండి తెరమీద, పత్రికల్లో వర్ణ చిత్రాల్లోనూ మెరిసిపోయే తారలు పెట్టి పుట్టిన వాళ్ళు అని ఆమెకి తెలుసు. కాని మద్రాసులో మామూలు మనుషులు ఎలా బతుకుతారో మాత్రం తెలియదు.

పరమేశ్వర శాస్త్రి ఇంటిలో గౌరికి సాదరమైన స్వాగతం లభించింది. ఇంతకీ స్వాగత మివ్వడానికి ఎవరున్నారు గనక? శాస్త్రిని, కొడుకు గోపీనీ మినహాయిస్తే ఇంటిలోని ఏకైక స్త్రీ నరసమ్మ. ఆమె శాస్త్రికి దూరపు బంధువు. వంటపని, ఇంటిపనీ చూస్తుంది. శాస్త్రి భార్య మద్రాసు వచ్చిన రెండేళ్ళకి కాలధర్మం చెందింది. ఆ తరవాతే గోపీ సంరక్షణ, పెంపకం ఓ సమస్య అయిపోయాయి. మద్రాసు వచ్చేటప్పుడు శాస్త్రి తలలో ఎన్నో ఊహలతో, కళ్ళలో ఎన్నో కలలతో వచ్చాడు. అందులో ఒకటి గోపీని తన వృత్తిలో తనని మించిన వాడుగా చేసి స్థిరంగా నిలబెట్టడం. కాని త్వరలోనే గోపీకి పౌరోహిత్యం మీద శ్రద్ధ, ఆసక్తి లేవని గ్రహించాడు। అయినా మద్రాసు వదిలి మళ్ళీ గ్రామం వెళ్ళడానికి మాత్రం ఇష్టపడలేదు. వెళితే ఏముంది, పూర్వపు గొర్రెతోక జీవితమేగా?

పరమేశ్వర శాస్త్రికి కొంచెం జ్యోతిషం కూడా తెలుసు. అదే అతడిని మద్రాసు తీసుకొచ్చింది. వాళ్ల ఊరి భూస్వామి ఒకడికి శాస్త్రి పాండిత్యం మీద గురి. అతడి ఇంట్లో ప్రతి పండగా ప్రతి పూజా శాస్త్రే చేయించేవాడు. అతడికి ఓ సారి ఎలా పుట్టిందో గాని సినిమా తియ్యాలనే కోరిక పుట్టింది. మద్రాసు వెళ్లి సినిమా తీశాడు. తీసినన్నాళ్లూ దానికీ దీనికీ శాస్త్రినే సలహా అడిగేవాడు. అతడి అదృష్టమో, శాస్త్రి అదృష్టమో గాని ఆ సినిమా బాగా హిట్ అయింది. దానితో అతడు మద్రాసు మకాం మారుస్తూ, తనతో బాటు శాస్త్రిని కూడా వచ్చెయ్య మన్నాడు. సినిమా రంగంలో తనకి చేతినిండా పని దొరుకుతుందని గ్రహించిన శాస్త్రి మద్రాసు కాపురం మార్చేశాడు. లౌక్యుడు కావడాన అందిపుచ్చుకుపోయి త్వరలోనే సినీ పెద్ద లందరికీ తలలో నాలుక అయ్యాడు. చాలామంది జ్యోతిష్కుల లాగే శాస్త్రి విజయానికి కారణం కూడా అతడి జ్యోతిష శాస్త్ర పాండిత్యం కాదు– అతడి సమయస్ఫూర్తి, పరేంగిత జ్ఞానం. ఏం చెపితే, ఎలా చెపితే ఎదుటి మనిషి సంతోషిస్తాడో, నాలుగు డబ్బులు రాలతాయో, అలా మెలగడం. అలా అన్ని విధాలా పైకి వస్తున్న శాస్త్రికి భార్యా వియోగం చెప్పుకోదగ్గ కష్టమే. అప్పటి నుండి గోపీకి కట్టడి,



## డింపుల్ నవ్వు

డింపుల్ కపాడియాలోని స్వభావం ఏమిటంటే- నవ్వటం లేదా కోపం తెచ్చుకోవటం. "అజూబా" చిత్రానికి సంబంధించి బొంబాయిలోని ఒక సరస్సులో షూటింగ్ జరుగుతుండగా నీళ్లలోంచి ఒక పాము బయటకు వచ్చిందట. అమితాబచ్చన్- డింపుల్‌ను చూసి జోక్ చేశాడట- అరే డింపుల్ పారిపోతోంది పట్టుకోండని.

కాని డింపుల్‌కి ఆ క్షణంలో కోపం రాలేదు సరికదా జోక్‌గా తీసుకొని నవ్వేసిందట. ఇది కూడా వింతేనా!

క్రమశిక్షణా లేకుండా పోయాయి. అతడు సులువుగానే తళుకు బెళుకుల సినిమా రంగంపై వ్యామోహం పెంచుకున్నాడు. అతడికి తండ్రి చేసే పౌరోహిత్యం నచ్చక పోవడానికి కారణం. పురోహితులు చాలా అన్ హీరోయిక్‌గా, అన్ రొమాంటిక్‌గా ఉండడమే. సినిమాల్లో నటించి పాపులర్ హీరో కావాలన్నది అతడి ఆశయం. అందుకు గాను తండ్రిపేరు వాడుకుని స్టూడియోల చుట్టూ, దర్శకుల చుట్టూ తిరుగుతూంటాడు. కాని ఎవరూ అతణ్ణి సీరియస్‌గా తీసుకోలేదు. తండ్రికి కనిపిస్తే తనవెంట 'రౌండ్స్'కి రమ్మంటాడేమో నని ఇంటా బయటా కూడా తండ్రిని తప్పించుకు తిరుగుతున్నాడు గోపీ. తండ్రి లేని సమయంలో ఇంటికొచ్చి గబగబా ఇంత తిని, నరసమ్మని బెదిరించి అయిదో పదో దొరక బుచ్చుకుని మళ్ళీ రోడ్డున పడతాడు. శాస్త్రి ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు, కాని తల్లి లేని పిల్లాణ్ణి గట్టిగా మందలించడానికి అతడికి నోరు రాలేదు.

గౌరి ప్రవేశించే సమయానికి ఆ ఇల్లు చుక్కాని లేని నావలా ఉంది. ఇల్లాలు లేని ఇల్లు మరి! వచ్చీ రాగానే గౌరి ఇంటి పెత్తనం కైవసం చేసుకుంది. ఇల్లు సర్ది అందంగా ఉంచడం, ఆదాయ వ్యయాలు సరి చూడడం, అతిథుల్ని, ఆ గంత కుల్ని సమాధాన పరచడం, శాస్త్రి కార్యక్రమాల్ని సకాలానికి గుర్తు చెయ్యడం– ఒకటేమిటి, ఇంటిని ఓ దారికి తెచ్చింది, త్వరలోనే. శాస్త్రి తన జోస్యం నిజమయినందుకు సంతోషించి, ఆమెకు పూర్తి స్వేచ్ఛనిచ్చాడు.

తమ ఇంటికి కొత్తగా వచ్చిన ఈ అమ్మాయిని ఎలా చూడాలో తెలియక ఇబ్బంది పడ్డవాడు ఒక్క గోపీయే. యువకుడు కాబట్టి, అంత దగ్గరగా ఒక అందమైన అమ్మాయి మసలుతూ ఉండడం అతడికి ఒక కొత్త థ్రిల్‌ని ఇచ్చింది. బయటికి చెప్పుకోకపోయినా వారి మధ్య ఒక సున్నితమైన

# గౌరి

అనుబంధం ఏర్పడింది. తనకి ఆమె మీద ఒకరకమైన హక్కు ఉన్నట్టు అనిపించేది గోపీకి. కాని అతడికి నచ్చని విషయాలు కొన్ని ఉన్నాయి. గౌరి అందమైనదే గాని పల్లెటూరి పిల్ల. సంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగింది. పట్నవాసపు ఫ్యాషన్లు తెలియవు. ఆమె జీన్సు, మిడ్డీలు వేసుకోవాలని, తనతో బీచిలకీ సినిమాలకీ రావాలని, పార్లర్స్‌లో ఐస్‌క్రీం తినాలనీ అతడి కోరిక, గౌరికి సినిమా తారల్ని చూపిస్తానని షూటింగులకి రమ్మనేవాడు. ఆమె ఏమీ ఆసక్తి చూపించేది కాదు. చాలా ఠీవిగాను, ఉదాత్తంగానూ ప్రవర్తించేది. గోపీతో ఎప్పుడూ కఠినంగా మాట్లాడకపోయినా, ఎంతో అభిమానంతో అతణ్ణి మందలించేది. అతడు కూడా గౌరి తనకన్న చాలా తెలివైనదని గ్రహించి, ఆమె ఎదుట తన కుర్ర తరహా ప్రవర్తనకి తనే సిగ్గు పడేవాడు. క్రమంగా తను ఆమెకి సరిపోలడని ఒక భయం, ఒక ఆత్మ న్యూనతా భావం అతడిలో బలపడజొచ్చాయి. ఆమె అతడిని తల్లిలా ఆదరించి, స్నేహితురాలిలా సలహాలిచ్చేది. అతడి మీద ఆమె వింత ప్రభావం ఎంతగా పడిందంటే, ఆమెను ఎదిరించి ఏమీ మాట్లాడలేకపోయే వాడు. ఆమె చెయ్యమంటే ఏ పని చెయ్యడానికైనా సిద్ధపడేవాడు. సుగుణాల రాసి అయిన గౌరితో పోల్చితే ఇంతకుముందు తనతో తిరిగిన గర్ల్ ఫ్రెండ్స్ అంతా షోకేసులో బొమ్మల్లా అనిపించారు అతడికి.

"ఇరవై నాలుగ్గంటలూ అలా రోడ్ల మీద తిరుగుతా వెందుకూ నువ్వు?" అని అడిగిందో రోజు మామూలుగా.

"ఇంకేం చెయ్యమన్నావు? అయినా నేను ఊరికే ఏం తిరగడం లేదు. నా అదృష్టం ఎలా ఉందో చూసుకుంటున్నాను...." అంతకంటె ఏమీ చెప్పలేదు గోపీ. ఎందుకనో, తను సినిమా హీరో కావాలనుకుంటున్నాడని ఆమెతో చెప్పడానికి సిగ్గుపడ్డాడు.

కాని ఆమెకి తెలుసు. అతడికి దగ్గరగా వచ్చి సానుభూతిగా అంది. "చూడు, అదంతా ఎండమావుల వెంట పరిగెత్తడమే. ఎన్ని వందల, వేల మంది సినిమా ఛాన్సుల కోసం మద్రాసు వచ్చి, కోరిక తీరక, వట్టి చేతులతో వెనక్కి వెళ్ళడం లేదు? ఈ మిథ్యా విలువల జీవితం పట్ల నీ కెందుకంత వ్యామోహం?"

గోపీ నిశ్శబ్దంగా తలవంచుకున్నాడు. ఇవన్నీ అతడికే తెలియకపోలేదు. కాని... అదంతే! మధ్యతరగతి మనుషులకి ఉండే బలహీనత అది– అర్హత, కృషి లేకుండానే అన్నీ సమకూరాలని కోరుకోవడం! ఓ రాయి విసిరి చూద్దాం, మన అదృష్టం బాగుంటే తగలవచ్చు– అనే తత్వం అది. మన అదృష్టం ఎక్కడో గ్రహాలు, నక్షత్రాల్లో కాక, మన చేతుల్లోనే ఉందని గ్రహించరు. "నీకు ఏ వృత్తి ఇష్టం?" అన్నాడు, మాట మార్చడానికి.


గౌరి అతడి కళ్లలోకి చూస్తూ "పౌరోహిత్యం" అంది.

గోపీ ఆమె వైపు అనుమానంగా చూశాడు. "అంటే నీ ఉద్దేశ్యం– నేను కూడా నుదుటిని వీభూది పూసుకుని, మెళ్లో జంధ్యం కనబడుతూ ఒంటి మీద చొక్కా లేకుండా వీధుల్లో తిరగాలనా?" అన్నాడు, కొంచెం కోపంగా.

గౌరి చిరునవ్వు దాచుకుని, దయగా అంది. "ఉహుఁ! నీకు నచ్చని పని చెయ్యమని నేను ఎలా బలవంతం చెయ్యగలను? కాని అసలు నీ కా వృత్తి అంటే అంత చిన్నచూపు ఎందుకో చెప్పు?"

గోపీ సమాధానం చెప్పలేదు.

"గోపీ, నీదంతా అపోహ. నేను ఎక్కువ గౌరవించే వృత్తి పౌరోహిత్యం అన్నాను కదూ? నిజమే. నేను హాస్యమాడటం లేదు. మీ నాన్నని చూడు. మా నాన్నని చూడు. వాళ్ళు స్వచ్ఛమైన బ్రాహ్మణులు. పరువూ మర్యాదా ఉన్నవాళ్ళు. ఉన్నంతలో సంతృప్తిగా, సంతోషంగా జీవితాలు గడుపుతున్న వాళ్ళు. ఊళ్ళో అంతా వాళ్లని గౌరవిస్తారు. వాళ్ళు లక్షలు గడించకపోవచ్చు, సూట్లూ బూట్లూ వేసుకోక పోవచ్చు. కాని వాళ్ళు సంస్కార వంతులు కాదా? సంస్కారం అన్న పదానికి అంతకన్న అర్థం ఏమిటి? వాళ్లని మనుషులూ దేవుళ్లూ కూడా మెచ్చుకుంటారు. వాళ్ల వాక్కు ఎంత స్వచ్ఛంగా ఉంటుందో, వాళ్ల మనసు, పని ఎంత విశ్వశ్రేయస్సుని కాంక్షిస్తాయో ఒక్కసారి ఆలోచించు. అంతకంటె ఎవరైనా సాధించే దేమిటి? గోపీ, నేను ఒక్క మాట చెప్తాను విను. నీ చేతులతో నువ్వు చక్కని భవిష్యత్తు పాడు చేసుకోకు. పైపై మెరుగులకి భ్రమసిపోయి ఆత్మ సంస్కారాన్ని, ఆత్మ సంతృప్తినీ ఇచ్చే ఈ దివ్యమైన వృత్తిని వదులుకోకు. ఎంతో పూర్వజన్మ సుకృతం కొద్దీ ఈ ఇంట్లో పుట్టేవు. మీ నాన్నదగ్గర చిన్నప్పుడు



సంస్కృతం చెప్పుకున్నావు. మరి ఆ అధ్యయనం, అభ్యాసం అంతా వ్యర్థం కావలసిందేనా? ఈ రోజుల్లో ఏదైనా మంచి ఉద్యోగం సంపాదించుకోవడం, ఒక కొత్త వృత్తిలో స్థిరపడడం ఎంత కష్టమో తెలుసా నీకు? దానికి కావలసినంత ఓర్పూ నేర్పూ ఉన్నాయా నీకు?"

గోపీ వంచిన తల ఎత్తలేదు.

"గోపీ, నా మీద నీకేమైనా అభిమానం ఉంటే నేను చెప్పే మాటలు విను. ఏ శ్రమా లేకుండా చేపట్టగల ఈ వృత్తిని ఎందుకు వదులుకుంటావు? మొదట్లో నీకే ఇబ్బంది వచ్చినా అండగా మామయ్య ఉంటారు కదా! పౌరోహిత్యం ఫ్యాషన్ కాదని నీ ఉద్దేశ్యం, ఔనా? పురోహితుడివైతే ఎంచక్కా రకరకాల డ్రస్సులు వేసుకోవడానికి వీలవదనేనా? సరే, ఆ మాట ఒప్పుకుంటాను. పోనీ, నీకు నచ్చినట్టే కానీ. నేను మామయ్యతో మాట్లాడనా? ఆయనకున్న పలుకుబడి అంతా ఉపయోగించి నీకు ఒక సినిమాలో వేషం ఇప్పించమని నీ తరపున నేను అడగనా?" అంది గౌరి, వరాలిస్తున్న దేవత తీరులో.

గోపీ మెరిసే కళ్లతో ఆమె వైపు చూశాడు. ఆమె గట్టిగా చెపితే తండ్రి ఆ ప్రయత్నం చేస్తాడని అతడికి తెలుసు. "నిజంగా అడుగుతావా? నా కోసం ఆ మాత్రం కష్టపడుదూ" అన్నాడు, ఆందోళన, అభ్యర్థనా కలగలిపిన స్వరంతో.

"అడుగుతాను. ఇది నీ పని కాదు, నా పని అనుకుని చెయ్యమంటాను. నే నడిగితే మామయ్య కాదనరు. మామయ్య తల్చుకుంటే పని జరగడమూ కష్టం కాదు" అంది గౌరి, స్థిరంగా.

"ఔనౌను. నాన్న తలుచుకోవాలే గాని, అదేమీ కష్టం కాదు" అన్నాడు గోపీ కూడా.


"సరే అలాగే అడుగుతాను గాని, నీకు దొరికే వేషం పురోహితుడి వేషం అనుకో - చేస్తావా?"

ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు గోపీ. "చేస్తాను. నా క్కావలసింది సినిమాల్లో నటించడం. ఏ వేషం అయినా సరే. పురోహితుడు కాదు. బిచ్చగాడి వేషమైనా సరే. ఆర్టిస్టు అన్నవాడు ఏ రోల్ వెయ్యడానికైనా సిద్ధపడే ఉండాలి."

గౌరి నవ్వింది అతడి మాటలకి. "అంటే లక్షలాది ప్రేక్షకులకి నువ్వు గుండు, పిలక, విభూది పిండికట్లతో కనిపించడానికి నీకు అభ్యంతరం లేదు గాని, కొద్ది మంది ముందు అలా తిరగడానికి నామోషీ అన్నమాట" అంది.

అతడికి ఆ మాటలు అర్థమవడానికి కొంతసేపు పట్టింది. అతడు ఏదో అనబోయేంతలో ఆమే మళ్లీ మాట్లాడింది. "చూడు గోపీ, పురోహితుడిగా నటించడానికి నీకు లేని అభ్యంతరం పురోహితుడిగా జీవించడానికి ఎందుకు? అసలు ప్రపంచమే పెద్ద నాటక రంగం అనీ, మనమంతా వివిధ పాత్రలు పోషిస్తున్న నటులం అనీ పెద్దలంటారు కదా! నువ్వన్నట్టు, మనకి దొరికిన పాత్రతో మనం సంతృప్తి పడి దానికి పూర్తి న్యాయం చెయ్యాలి గాని-"

గోపీ ఆమె మాటలకి మధ్యలోనే అడ్డుపడుతూ,




"అయితే మా నాన్నతో మాట్లాడి వేషం ఇప్పిస్తానన్న మాటలన్నీ అబద్ధమే నన్నమాట" అన్నాడు కోపంగా.

"కాదు కాదు. అదికాదు నా ఉద్దేశ్యం" అంది గౌరి. "నా మీద ఊరికే అలగకు. నేను చెప్పే మాటలు కొంచెం ఓర్పుగా, శ్రద్ధగా విను. నేను నీ శ్రేయోభిలాషినని, నీ మేలు కోరుతాననీ నమ్ముతావా?" అంది, సూటిగా.

గోపీ తల ఊపేడు.

"అయితే విను. నా సలహా ఏమిటంటే, రేపటి నుంచి మామయ్యకి అసిస్టెంటుగా ఆయనతో బాటే నువ్వు తిరుగుతూ ఉండు. డ్యూటీలో ఉన్నంతసేపే ఆ వేషం. తరవాత మామూలుగా ప్యాంటు, షర్టు వేసుకోవచ్చు. మామయ్యతో కలిసి ఉంటే సినిమారంగంలోని పెద్దలందరి దగ్గరకీ నీకు ప్రవేశం సులువుగా లభిస్తుంది. నీ జీవిక కోసం నువ్వు వేరే ఉద్యోగం ఏదీ చూసుకో అక్కర్లేదు. ఈ లోగా వ్యాయామం అదీ చేసి నీ శరీరాన్ని ఆకర్షణీయంగా అభివృద్ధి చేసుకో. నీకు పెద్దల దగ్గర ప్రవేశం, చనువు బాగా ఉన్నాక సరదాగా ముందు పురోహితుడి వేషం ఇమ్మని అడుగు. ఆ వేషంలోనే నిన్ను ఎప్పుడూ చూస్తూ ఉంటారు కనక దర్శకులూ నిర్మాతలూ అందుకు సులువుగానే ఒప్పుకోవచ్చు. అందులో రాణిస్తే తరవాత మంచి వేషాలు వాటంతట అవే వస్తాయి. నువ్వు రోడ్డు పట్టి తిరుగుతున్నంత సేపూ రోడ్డుమీదే ఉంటావు. నువ్వు ఈ పౌరోహిత్యం గనక ప్రారంభించావా, నీకు నిలకడ కుదురుతుంది. బాధ్యత తెలుస్తుంది. మామయ్యా సంతోషిస్తారు. ఆయన మీద ఎక్కువగా ఆధారపడకుండా నీ కోరిక నువ్వూ తీర్చుకోవచ్చు. ఇది నీ సినిమా ప్రయత్నాలకి అవరోధం కాదు సరికదా, ఆ ప్రయత్నం సులువుగా నెరవేరేందుకు చక్కని అవకాశం. ఆలోచించు మరి...."

గౌరి వంక మెచ్చుకోలుగా చూస్తూ ఉండిపోయాడు గోపీ. ఆమె చెప్పింది నిజం. ఇన్నాళ్లూ తనెందుకు ఇలా ఆలోచించలేదు?

నెల రోజులు తిరక్కుండా గోపాలశాస్త్రి తండ్రికి జూనియర్‌గా స్థిరపడ్డాడు. పరమేశ్వర శాస్త్రి ఆనందాశ్చర్యాలకి మేరలేదు. ఈ ఆకస్మిక మార్పు ఎలా వచ్చిందో అతనికి తెలియలేదు గాని, దాని వెనుక గౌరి అదృశ్య హస్తం ఉందని మాత్రం అతడు గ్రహించాడు.

కొన్ని రోజుల తరవాత గౌరి బట్టలు సర్దుకుని, "ఇక నేను వెళ్తాను మామయ్యా. శలవిప్పించండి" అంది.

అంతా ఆశ్చర్య పోయారు. వొద్దన్నారు, బ్రతిమాలేరు. "మా తెల్లావు చూలుతో ఉంది. ఈనే రోజులు దగ్గర పడ్డాయి. నేను వెళ్లాలి. అదీగాక మా ఊరి అమ్మవారి సంబరం ఇంకెన్నాళ్లో లేదు. నన్ను వెళ్లనివ్వండి" అని మాత్రం అంది గౌరి.

పరమేశ్వర శాస్త్రి, గోపాల శాస్త్రి గౌరిని సెంట్రల్ స్టేషనుకి తీసుకు వెళ్లి టికెట్ కొని సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఎక్కించారు. పరమేశ్వర శాస్త్రి ఆమె తల నిమురుతూ మనసులోనే మౌనంగా ఆశీర్వదించాడు. గోపీ ఆమె వంక సభక్తికంగా చూస్తూ ఉండిపోయాడు. ఆమె మరింక మద్రాసు రాదని వాళ్లిద్దరికీ తెలుసు.

●